
# అతను ఇక లేడు



ఖంగు ఖంగున పన్నెండు గంటలు ఊళ్లో కొత్త భవనంనుండి వినిపించాడు కావలాదారు. చల్ల గాలి వీచసాగింది. తేళ్లూ, పాములూ, జెర్రులూ వాటివాటి నెలవులు వీడి నిర్భయంగా సంచరించసాగాయి. గబ్బిలాలు, కబోదిపక్షులు ఆహారం కోసం రివ్వురివ్వున ఎగురుతున్నాయి. ఉండిఉండి గుడ్లగూబలు గుగుర్పాడిచేలా అరుస్తున్నాయి విద్యుత్ దీపస్తంభాలపైన.

చీకటినీడల్లా వీథుల్లో తిరుగుతున్నారు రాత్రించరులు, తాగుబోతులు, జూదరులు, వ్యభిచారులు.

“టాక్సీ. . .”

కేక వినిపించింది, భయంభయంగా ఎవరో పిలిచినట్లు.

అతను తల ఎత్తి చూశాడు పిలుపు వచ్చిన దిక్కును పోల్చుకుంటూ. చీకటిమూలల్లోకి పొడిచి పొడిచి చూడసాగాయి కళ్లు.

ఎదురుగా రైల్వేవంతెనలు, ఎత్తైన రైల్వేకట్ట పట్టణాన్ని బెర్లిన్ నగరంలా రెండుగా చీలుస్తూ దిక్కుల్లోకి చొచ్చుకుపోతూంది.

పట్టణపు ఔన్నత్యాన్ని చాటుతూ ఎత్తైన శ్రీమంతుల భవనాలు అంతస్తులతో, రంగురంగు దీపాలతో ఉజ్జ్వలంగా మెరిసిపోతున్నాయి కట్టకు అవతలివైపు. పట్టణపు అధోగతిని మరుగుపరుస్తూ, మురుగుకాలువతో పరివేష్టితమై పగలంతా మండు టెండలో కాగిపోయిన తాటాకు గుడిసెలు చీకటిలో జోగుతున్నాయి ఇవతలివైపు.

పిలిచిన కంఠం ఆనవాలు కనిపించలేదు.

మరోసారి కేకకోసమై నిరీక్షిస్తూంది మనస్సు.

కచ్చపచ్చగా నమిలి మిరపకాయ బజ్జీలను గొంతుకలోకి నెట్టాడు. చేతులపై జిడ్డును కాకీపంట్లాంకు రుద్దుకొన్నాడు. “సింగిల్ టీ, అర్జెంటు.” వెనక జేబులోనుండి తీసిన చిల్లరను కాగడాదీపం వెలుగులో చూసి టీకొట్టువాడి కిచ్చాడు.

“టాక్సీ”. . . మగకంఠం. . . సుకుమారత్వంతో కూడిన కంపనం.

ఎదురుగా పొగలు కక్కుతూన్న టీ పెట్టాడు కొట్టువాడు. రెండుమూడు గుక్కల్లో స్వాహా చేసేటప్పటికి ముఖమంతా చిరుచెమటలు పోశాయి. చివరి గుటకలో గభాలున నోటిలోకి వచ్చిన తేయాకు పిప్పిని తుపుక్కున ఉమ్మేశాడు.

పిలిచిన ఆకారాన్ని వెతికాయి చూపులు.

గుడిసెలవైపుగా వచ్చింది ఆ పిలుపు. ఆ కొంపల మధ్య వెక్కిరిస్తూన్నట్లు చిన్న డాబా. దాని చుట్టూ తడికలు. తడికల సందుల్లోనుండి వెలుగు మరకలు కనిపిస్తున్నాయి బొల్లిమచ్చల్లా.

సంతృప్తిగా నిట్టూర్పు విడిచి టీ గ్లాసు చెక్క బల్లపై పెట్టి ఆ ఇంటికేసి చూశాడు.

ఆ ఇల్లు. . .

అసత్యమైన, అనిత్యమైన ఐహికజీవితంలో అసంతృప్తి చెందిన అభాగ్యులందరికీ అతి చౌకగా జీవనానందాన్ని అందించి, ఆస్వాదింపజేసి ఆనంద పరిచే స్వర్గధామం. లుకలుకలాడే రూపురేఖ, పేరులేని వ్యాధులతో, వ్రణాలతో వికలుషితమై దృగ్గోచరం కాని మంటలతో భగ్గున మండి

ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక

ప్రకటన రేట్లు

కాజువల్. కాలం సెం. మీ 1 కి రు. 7–50
కంట్రాక్టు: కాలం సె మీ 1 కి రు. 6–80
250 సెం. మీ. లు, అపైన
ప్రకటనకు కనీస స్థలం
సిం. కాలం 5 సెం. మీ. లు

అట్ట పేజీలు :

4 వ పేజీ - రెండు రంగులు
కాజువల్: ప్రకటన 1 కి రు. 1,100/—
కంట్రాక్టు: ప్రకటన 1 కి రు. 950/—
( కనీసం 6 ప్రకటనలు )

2 వ పేజీ, 3 వ పేజీ -
ఒక రంగు
కాజువల్: ప్రకటన 1 కి రు 700/—
కంట్రాక్టు: ప్రకటన 1 కి రు. 600/—
( కనీసం 6 ప్రకటనలు )

కొలతలు:
కాలం వెడల్పు 5 సెం మీ.
కాలం నిడివి 23 సెం మీ.
పేజీకి 3 కాలంలు

ఇతర వివరములకు దిగువవారికి వ్రాయండి:
అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజర్,
ఆంధ్రప్రభ
సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్. మద్రాసు-2
1–8–66 నుండి ప్రకటనలరేటిమీదను
10% సర్చార్జి విధింపబడును

పోతూన్న నరకకూపం. వ్యభిచారాన్ని జీవనోపాధిగా చేసికొని, రక్తమాంసాలను పెట్టుబడిగా పెట్టుకొని బ్రతుకులు సాగిస్తూన్న అనాథల అగాథ కుహరం. యుగయుగాలుగా ఆరని, తీరని కామజ్వాలలకు తనువులు ఆహుతిచేసుకొన్న బలిపశువుల విషాదకూపం. ఒక నోటు దానం చేసిన ధర్మాత్మునికి కృతజ్ఞతతో మానం అర్పించి, ఉదాసీనంగా ఉండిపోయే దిక్కులేని అక్కచెల్లెళ్ల ఆశ్రమవాటిక.

ఆ ఇంటిముందు బేరాలు మాంచి గిట్టుబాటుగా ఉంటాయి. మీటర్ చూడకుండా నోట్లు చేతిలో కుక్కి గంభీరంగా దిగిపోతారు. కారుసీట్లను గూర్చి, చిరిగిపోయిన పరుపులపై రవ్వంత గొణుగుడుకూడా ఉండదు. దబ్బున పోవాలి.

భాయొనెట్ కింద కర్ర తొలగింది.

స్టీరింగ్ పట్టుకొన్నాయి చేతులు. డౌన్‌లో కొద్ది దూరం ఉట్టినే దొర్లిపోయాయి టైర్లు. అప్పుడు ఓల్డ్ ఫోర్డ్ పెద్దగా గర్జించి మామూలు స్థాయికి దిగిపోయింది. రివ్వున పిలిచిన వ్యక్తికేసి దూసుకుపోయింది కారు.

బ్రేక్ పైకాలు వేసి ఎక్కబోతూన్న వ్యక్తులను కుతూహలంగా పరిశీలించసాగాడు. నొసటిపైకి వాలి ఉన్న టోపీ అంచును కొద్దిగా పైకెత్తాడు.

ఒక ఆడ. . . ఒక మగ.

అతను విద్యార్థిలా గొట్టంపంట్లాం, బిగుతైన స్లాక్‌చొక్కా.

ఆమె . . తెల్లని చీర, రవికె ధరించింది. ఆ తనూ సౌందర్యపు వెలుగులను చూడనివ్వని చీకటి నీడలు. వాలుగాలికి గుప్పున వాసనలు. సిగలో ధరించిన మల్లెపూల పరిమళం. ముఖానికి పులుముకున్న చౌకబారు స్నోవాసన. బట్టలకు పూసుకొన్న అత్తరు ఘుమఘుమలు.

అతను ఆదురాగా డోర్ తీశాడు.

ముందు ఆమె, తరవాత అతను. దగ్గిర దగ్గిరగా ఆనుకొని కూర్చున్నాయి శరీరాలు.

"రింగ్‌రోడ్డుకు పోనివ్వు."

మూలగా వెనక్కి తిరిగింది కారు వానకు కొట్టుకుపోయిన రోడ్డుపై, గతుకుల్లో పడుతూ లేస్తూ, గింజుకొంటూ నడక సాగించింది రెండు వంతెనల కిందుగా. ముక్కులు పగిలిపోయే కంపు అక్కడ నగరపు డ్రెయినేజికి హద్దులు లేవు. వెనక సీట్లో వాళ్లిద్దరూ తిట్టుకొంటూ ముక్కులకు గుడ్డలు అడ్డం పెట్టుకొన్న అలికిడి.

"పాడు గవులు . . . అక్కడే ఉందామంటే విన్నావా నా మాట. . ."

"ఈ కొద్ది దూరమే. . ." అతని ప్రత్యుత్తరం.

కోడెవయస్సులో ఉన్న జంట. ఒకరి శరీరానికి మరొకరు చేరువగా కూర్చొని కూరిమితో కబుర్లు చెప్పుకొంటున్నారు.

"దూరం కాదు . . . అసలు నీ రూమ్‌కి పోకపోతేనేం ఈ అర్ధరాత్రివేళ. . ."

"అవుననుకో . . . కానీ . . కానీ . . . నా కిక్కడ బావుండదు. . అంటే, స్వేచ్ఛగా ఉండదు. ఎవరో మనల్ని గమనిస్తూన్నట్లు భయపడతాను. నా రూమ్‌లో అయితే ఆ బాధ లేదు. . ఇంకొక విషయమేమంటే, నా రూమ్‌లో నీవు నా సొత్తు. స్వంతం

మగువ హృదయమే ఒక ప్రేమాలయం. ఆ మందిరంలో ఒకసారి ప్రవేశించిన వ్యక్తిని ఆమె ఎన్నటికీ మరచిపోలేదు. ఆ మధురస్మృతులే చిరకాలం ఆమెకు తృప్తినిస్తాయి. కాని మగవాని ప్రేమ లతలో డబ్బు జీవరసంలా ఉంటుంది. అది లేని ప్రేమలత ఎండిపోతుంది. తన మరణాన్ని తానే ఆహ్వానిస్తుంది.

అనేలా ఉంటుంది . . . ఇక్కడున్నంతసేపు పరాయిదానిలా అనిపిస్తావు. . . అందుకు . . ."

అతను ఆమెకు మరింత చేరువగా జరిగినట్లు తుప్పుపట్టిన సీటు స్ప్రింగులు కీచుమన్నాయి. ఆమె చేతి గాజుల గలగలలు.

కారులో లైటు లేదు.

వంతెనలకింద చీకటి. కామంలాటి చీకటి. ఒళ్లు తెలియని చీకటి. చీకటిలో వాళ్లిద్దరూ వెనక సీట్లో.

గీరు మార్చి చెవులు రిక్కించాడు తను.

వాళ్ల మాటలు వినాలనే కుతూహలం.

స్టీరింగ్ పట్టుకొన్న చేతులు లాంఛనంగా బాధ్యత నిర్వహిస్తున్నాయి. అలవాటయిన కాళ్లు అడపా దడపా కింది పరికరాలను తొక్కుతున్నాయి. నేలపై పరుగెడుతూన్న వెలుగులోకి పరాగ్గా చూస్తున్నాయి గాజుకళ్లు.

తనకు లేనిది, తనది కానిది తనకు కావాలని కోరుకొంటున్నది వెనక సీట్లో అతనిది ఉంది. అసూయతో భగ్గున మండిపోయింది హృదయం. నరాలను జివ్వుమనిపించేలా వేడినెత్తురు పరవళ్లు తొక్కసాగింది.

"నీవుకూడా ప్రకాష్‌లాగే సున్నిత హృదయం కలవాడివి. . . కానీ నీవు పిరికివాడివి. . . అదే మీ ఇద్దరికీ తేడా. . . నీతో పరిచయమైనప్పటినుండి గమనిస్తున్నాను. . ." ఎగతాళితో కూడిన చిన్న నవ్వు.

ఏక్సిలరేటర్‌నుండి కాలు పైకి తీశాడు తను.

కాలాన్ని మెల్లిగా వాయిదావెయ్యటానికి ప్రయత్నించసాగింది కారు.

"నీవు అస్తమానం 'ప్రకాష్, ప్రకాష్' అంటూంటే నా కెలా ఉంటుందో చెప్పు. . . నేను ప్రేమించినంతగా అతను నిన్ను ప్రేమించలేదు . . గ్యారంటీ. . . అతను నిన్ను హృదయపూర్వకంగా ప్రేమిస్తే నిన్నిలా నడిబజారులో వదిలిపెట్టి వెళ్లేవాడు కాదు . . . ఏమిటో గొప్పగా చెబుతావ్ అతన్ని గూర్చి. . ."

ఆని మనస్సులో ఓర్వలేనితనం పెదవులపై కదిలింది.

"అలా అనకు. . . ప్రకాష్‌ను గూర్చి నీ కేమీ తెలియదు. . . తను నా మూలంగా సర్వనాశనమైపోయాడు. . . 'మనం ఇలానే దొంగచాటుగా కలుసుకొందాం. . . ఈ సాహసంవలన మనకు మిగిలేది

తాడిగిరి పోతరాజు

దుఃఖమే' నని ఎంతో చెప్పాడు. . . కానీ నేనే బలవంతం చేశాను లేచిపోదామని . . . పాపం, వాకోవమని వాళ్ల అమ్మనూ, తూగానెళ్లినీ వదులుకొని వచ్చాడు. వాళ్లిప్పుడు ఏ చుట్టాల గడపల్లోనో నానా చీవాట్లు తింటూ అగచాట్లు పడుతూండవచ్చు. . . వాళ్ల ఉసురు నాకు తప్పక తగులుతుంది. . ."

ఉద్రేకపూరితమైన, పేలవమైన కంఠం.

ఎన్నో స్మృతులతో, దిగుళ్లతో బండబారిన మనస్సు లీలగా కదులుతూంది.

"మెల్లిగా మాట్లాడు. అతను వింటాడు. . ." ఇంగ్లీషులో అతని అభ్యంతరం.

"ఆఁ . . . మనలాటివాళ్లను ఎంతమందిని చూశాడో. . ." ఆమె ప్రత్యుత్తరంలో నిర్లక్ష్యమైన వైఖరి.

కంకరరోడ్డును వెనక్కి తోసి సిమ్మెంటురోడ్డు పైకి ఎగబ్రాకసాగింది టాక్సీ. మునిసిపాలిటీ ఫ్లోరో సెంటు దీపాలు యూనిఫారంలో ఉన్న పెరేడ్ సైనికుల్లా బారులుతీరి ఉన్నాయి.

"అంతగా ఒకరి మీద మరొకరికి అంత ఇది ఉంటే మరి. . . మరి ఎందుకు నిన్ను విడిచి వెళ్లాడు?. . ." ఆ మాటల్లో కుతూహలం లేదు. . . జాలి మాత్రమే.

"మరి, ఎన్నాళ్లని నాతో పస్తులు పడుకోమంటావు అతన్ని?. . ." ఆమె కంఠం మెల్లగా ఆగి ఆగి అంది.

ఓ నిమిషం నోరు మూతపడిపోయింది.

"మేము లేచివచ్చినప్పుడు మేము అనుకొన్నంత తేలిగ్గా అతనికి ఉద్యోగం దొరకలేదు. మామూలు కూలీగా చేరి గోతాలు మోశాడు కొన్నాళ్లు. నెత్తురు పడేలా ఇద్దరు ముగ్గుర్ని ఎక్కించుకొని రిక్షా తొక్కాడు మరికొన్నాళ్లు. . . కానీ అలవాటు లేని జీవితం. . . ఒక్క రోజు కష్టం చేస్తే రెండు రోజులు మూనేసే వాడు. . . ఆకలితో చచ్చిపోయి ఒకరి నొకరం కౌగిలించుకొని ఏడ్చేవాళ్లం . . . చిన్నపిల్లవానిలా నా చీరలో ముఖం దాచుకొని ఏడ్చేవాడు . . . పిచ్చివాడు. . . ఎక్కడున్నాడో. . . కానీ ఎప్పటికైనా నన్ను వెతుక్కుంటూ వస్తాడనుకొంటా!"

మాతృమూర్తిలా తియ్యని కంఠం.

అతని స్మృతులతో పరవశం చెందుతూన్న అనుభూతి వ్యక్తమౌతూంది.

"మూడేళ్లనుండి రానివాడు ఇంకేం వస్తాడు?"

"రాకేం చేస్తాడు?. . . రాడంటావా?. . ." మాటల్లో తత్తరపాటు, నిస్పృహ.

"ఉంటే కదా?"

"అంటే. . ."

"బ్రతికుంటే. . ."

"అలా అంటానికి నీకు నోరెలా వచ్చింది?. . . అతనంటే నీకు అసూయ కలుగుతూంది. అందువలన నీ వలా మాట్లాడుతున్నావు. . . మనుషులు ఎంత విచిత్రంగా ఉంటారు. . . నీవు అతన్ని ఎప్పుడూ చూడలేదు. . . అయినా నీకు అతనిపట్ల అసూయ..."

మగజంతువు స్వభావాన్ని ఎనలైజ్ చేసింది క్లుప్తంగా కొద్దిపాటి నీవగింపుతో. . . అనూహ్యమైన వ్యాఖ్యానం.

కరెంటుస్తంభం దాటినప్పుడల్లా కొంత వెలుగు కారులోని ముఖాలను తొంగిచూస్తూంది. డ్రైవరు సైడ్‌మిర్రర్ వాలుగా సరిచేసుకున్నాడు, వెనకవాళ్ళు కనిపించేలా.

మెరుపు మెరిసినట్లు అద్దంలో ఓ క్షణకాలం వెలుగు.

ఆ వెలుగులో వెనకవాళ్ల ప్రతిబింబాలు తూలి పోతున్నాయి. అద్దంవలన ప్రయోజనం లేదు.

"క్ప్..." పెదవులు లోనికి ఒత్తుకున్నాడు.

"అసూయ కాదు. . . నీవు నన్ను అపార్థం చేసుకొంటున్నావ్. . ." క్షమాపణ వేడుకొంటూన్న ధోరణిలో మెల్లగా సంజాయిషీ చెప్పసాగాయి అతని పెదవులు.

రెండు నిమిషాల స్తబ్దత.

"అతను చాలా సున్నితమైన మనస్సు కలవాడని చెబుతున్నావు కదా!. . . అలాటివాళ్లతో మహ పేచీ. . . జీవితంతో విసుగెత్తి ఏదైనా అఘాయిత్యానికి పాల్పడ్డాడేమోనని నా అనుమానం . . . ఒకవేళ

> **మార్దవం**
>
> మనిషిలో మార్దవం ఎంత తక్కువగా ఉంటే, అంత ఎక్కువగా దానిని ఇతరులవల్ల ఆశిస్తాడు.
>
> —రాహెల్
>
> * * *
>
> **సలహా**
>
> మనం భాగ్యవంతులమయి నప్పుడు బాధపడేవారికి సలహా లివ్వడం తేలిక.
>
> —ఎస్కైలస్
>
> **పెద్దతనం**
>
> పెద్దవాడవయ్యావని మొట్ట మొదటగా ఎవరన్నా అన్నప్పుడు మనిషి నిర్ఘాంతపోతాడు.
>
> —డబ్ల్యు. ఒ. హోమ్స్

బ్రతికిఉంటే మూడు సంవత్సరాలలో ఒక్కసారయినా నిన్ను వెతుక్కుంటూ రాకపోతాడా?. . ."

"అవును. . ." ఒక నిశ్చయానికి వస్తున్నప్పటి ఆలస్యం, పరాకు.

"ప్రకాష్ అప్పుడప్పుడూ నిరాశగా అంటూండే వాడు, 'ఇద్దరం కలిసి బావిలో పడి చచ్చిపోదా' మని. . . 'లేకపోతే రైలుకింద పడదా'మని. . . అయితే ప్రకాష్ ఇక లేడా మరి?. . . అవును . . . అదికూడా సంభవమే. . . నే నా విషయం ఎప్పుడూ ఆలోచించ లేదు. . . నన్నుకూడా చంపటం ఇష్టంలేక తన దారి తాను చూసుకొన్నాడు. . ." తనలో తాను మాట్లాడు కొన్నట్లు ధోరణి.

'గుయ్ గుయ్' మని గింజుకొంటూంది ఇంజను.

జనసంచారంలేని వీధులు. అడపా దడపా ఓ గాడిద, ఓ ఆవు రోడ్డుకు అడ్డంగా నిలబడటం మినహా వేరే ఆటంకాలు లేవు. నిర్లక్ష్యంగా పోతూంది కారు.

"అతను...ఇక...లేడు . . . ఉంటే నా వద్దకు తప్పక వచ్చిఉండేవాడు."

పన్నని రోదన మూలుగులా. ముఖం రెండు చేతులతోను కప్పుకొని దుఃఖం నిగ్రహించుకోవటానికి చేసే ప్రయత్నంలో గాజుల శబ్దం.

రోడ్డుమలుపును, వంతెనను సూచిస్తూన్న రహదారి శాఖ బోర్డును దాటింది కారు.

"ఎందు కేడుస్తున్నావ్? . . . ఒకవేళ అతను బ్రతికేఉన్నాడేమో . . . ఎలా చెప్పగలం?" బలవంతంగా ఒడిలోకి తీసికొంటూ అతని ఓదార్పు.

"లేడు. . . అతను ఇక లేడు. . ." దుఃఖంతో కూడిన దీర్ఘమైన నిట్టూర్పు.

అవతల ఎదురు మలుపునుండి గుప్పుమని తీక్షణ కాంతి. డ్రైవరుకు ఓ నిమిషం కనురెప్పలు మూతపడ్డాయి. లారీ హారను వినిపిస్తూ శరవేగంతో దూసుకు వస్తూంది. స్టీరింగ్ పట్టుకొన్న చేతులు పట్టు తప్పిపోసాగాయి. బలంగా పక్కకు తిప్పుకొన్నాడు. లారీ దూసుకుపోయింది.

పడన్ బ్రేక్!

'కీచు' మంటూ టైర్లు నేలను రాసుకొన్నాయి. వెనక సీట్లో వాళ్ళు ఎగిరి ముందుకు పడి కొంతవ్వ వగలగొట్టుకున్నారు. కారు ముందుఅద్దాల లైట్లు భళ్లున పగిలిపోయాయి. చెట్టుకు గుద్దుకుపోయింది ఓల్డ్ ఫోర్డ్. రెప్పపాటులో అన్నీ జరిగిపోయాయి.

దయ్యాలు జడలు విరబోసికొన్నట్లున్న మంచి చింత చెట్లు పట్టణపు పొలిమేరల్ని కలిపే రింగురోడ్డు బారులో నిలబడి ఉన్నాయి. దూరదూరంగా, ఏకాంతంగా, స్వతంత్రంగా ఉన్న మేడలు...నిర్జనమైన ప్రదేశం... దూరాన కుక్కల ఏడుపులు. ఒక్క ఫర్లాంగు దూరంలో నవ్వులు. పెద్దపెద్దగా మాటలు. రెండవ ఆట సినిమా ప్రేక్షకులు వస్తూన్న అలికిడి.

"ఘోరం, సుజాతా! . . . పోలీసులు రాకముందే ఇక్కణ్ణించి మనం పారిపోవాలి. . . త్వరగా పరిగెత్తు..." అతని మాటలు తడబడ్డాయి. ముచ్చెమటలు పోసిన చేతితో ఆమెను గట్టిగా పట్టుకొన్నాడు. భయకంపితులై ఇద్దరూ ఒక్క ఉదుటున బయటికి దూకారు.

వణకుతూన్న కాళ్లతో చీకటిలోకి దూసుకు పోయాయి రెండు ఆకారాలు.

రోడ్డుపై డ్రైవరు ధరించే టోపీ. రోడ్డున నడుస్తూన్న జనం టక్కున ఆగిపోయారు. అందరూ గగ్గోలుగా అరుస్తూ కారువైపు పరిగెత్తారు. ఒకరు టార్చిలైటు వేశారు.

పచ్చుపచ్చయిన చిన్న కారు.

స్టీరింగ్‌రాడ్ ఎదురురొమ్ములోకి దిగిపోయిన డ్రైవరు. తల ముందుకు వాలిపోయింది. వాలిన తలపై పగిలిన గాజుపెంకులు. నోటివెంట కారిన నెత్తురు బట్టలపై ప్రవించి చల్లగాలికి ఘనీభవించసాగింది. సీటుపై పగిలిన గాజుపెంకులు, నట్లు, బోల్టులు, చిన్న చిన్న సాధనాలు. వాటి మధ్యలో గాలికి రెపరెప లాడుతూన్న లైసెన్సు నోటుబుక్కు.

అనువులు బాసిన డ్రైవరు ఫోటో.

పక్కనే అతని పేరు ... ప్రకాష్!

ఖంగుమని ఒకటి కొట్టాడు కావలివాడు. ★